క్లుప్తంగా

రహదారులు జలమయం



దుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

దుంబ్రిగుడ: మండలంలోని దుంబ్రిగుడ, అరకుసంత, కించుమండ, గుంటసీమ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు భారీ వర్షం కురిసింది. విద్యార్థులతో పాటు వారపు సంతలకు వెళ్లే వ్యాపారులు, రైతులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. రహదారులు జలమయమయ్యాయి. అకాల వర్షాలతో చేతికందనున్న వేరుశనగ పంట దెబ్బతింటుందని, గత్యంతరం లేక వాటిని ముందగానే సేకరించి తక్కువ ధరలకు వ్యాపారులకు విక్రయిస్తున్నట్టు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధిలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అవార్డు గ్రహీతకు సన్మానం



ప్రఫులాను సన్మానిస్తున్న హెచ్ఎం నిర్మల తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కుక్‌గా పనిచేస్తున్న జి.ప్రఫులా అందజేస్తున్న సేవలకు స్వాతంత్ర దినోత్సవం నాడు పాడేరులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో జోలాపుట్టు పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు తదితరులు ప్రఫులాను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన పనితీరుకు తగిన గుర్తింపు లభించిదని హెచ్ఎం నిర్మల చెప్పారు.

ఎమ్మెల్సీగా బొత్స ఎన్నిక హర్షణీయం



ఎంపీపీ రమేష్

కొయ్యూరు: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుల తరఫున ఎంపీపీ బడుగు రమేష్ అభినందనలు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఎవరూ లొంగకపోవడంతో ఓటమి తప్పదని భావించి అభ్యర్థిని నిలపలేదని తెలిపారు. మండలంలో కొందరికి ప్రలోభాలు గురిచేసేందుకు కూటమి నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు ఇప్పటికి ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: మండలంలోని మర్రివాడ పంచాయతీ గుడ్లపల్లిలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ శనివారం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఎవరూ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. దీని మూలంగా వారి జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. గిరిజన రైతులు వాణిజ్య పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సమస్యలతో సతమతం

- కానరాని డ్రైనేజీలు
- అధ్వాన దారులతో ఇక్కట్లు
- రహదారులపై మురుగునీరు
- పాదచారులు, వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



హుకుంపేటలోని కామయ్యపేట- మట్టుజోరు ప్రధాన రహదారి దుస్థితి



దుంబ్రిగుడలో డ్రైనేజీ కోసం తీసిన గోతిలో చేరిన మురుగునీరు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో నిర్మాణంలో ఎన్‌హెచ్516 జాతీయ రహదారిని అనుకొని ఉన్న రోడ్డులో డ్రైనేజీ పనుల నిమ్మిత్తం జేసీబీతో తీసిన గోతులు పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో గోతుల్లో మురుగునీటి నిల్వతో దర్శనమిస్తున్నాయి. తీవ్ర దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ ఉన్న ప్రదేశంలోనే కొత్త డ్రైనేజీల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు గోతులు తీశారు. అయితే రెండు నెలలు కావస్తున్నా పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేశారు. డ్రైనేజీ నుంచి తీసిన మట్టిని తొలగించకుండా రోడ్డుపై పడేయడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. రహదారి రోడ్డు చిత్తడిగా మారింది. వర్షం పడినపుడు పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈగోతులు ఎందుకు తీశారో.. ఎందుకు వదిలేశారో.. అర్థం కావడంలేదని, అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ ఆదేశానుసారం గోతులు తీయించామని, పనులు చేసేందుకు నిధులు లేక నిలుపుదల చేశామన్నారు. సుమారు రూ.30 లక్షల వరకు నిధుల అవసరమున్నట్టు పంచాయతీ ఇంజినీరు అసిస్టెంట్ ప్రతిపాదనలు ఇచ్చారన్నారు.దీనిపై ఉన్నతాధికారులకు ప్రతిపాదించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

కామయ్యపేట రహదారి గోతులమయం

హుకుంపేట: మండల కేంద్రం నుంచి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కామయ్యపేట ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. మట్టుజోరు నుంచి అల్లంపుట్టు వరకు సుమారు 4 కిలోమీటర్లు గోతులతో దర్శనమిస్తున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టుజోరు సమీపంలో కల్వర్టు కూలింది. దీంతో పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని వాహనచోదకులు చెబుతున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా వెళ్లేందుకు ప్రదాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

విలియం కేరీ సేవలు శ్లాఘనీయం



మాట్లాడుతున్న లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని ఓ చర్చిలో విలియం కేరీ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా, సామాజిక వేత్తగా, భాషా అనువాదిగా, క్రైస్తవ మిషనరీగా విలియం కేరీ అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. అనేక సాంఘిక దురాచారాలను ఖండించి, ఎన్నో సంఘ సంస్కరణలపై సమాజాన్ని చైతన్య పరిచారన్నారు. భారతీయ క్రైస్తవ సమాజం తరపున ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు సదానందం, అబ్రహాం, విలియమ్ తదితరులు పాల్గొన్నారు.

అరకు కాఫీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థులకు టెక్నో సర్వ్ వాల్మర్ట్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అరకు కాఫీ తయారీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన్యంలో లభించే నాణ్యమైన ఆర్గానిక్ కాఫీకి దేశ, విదేశాల్లో మంచి మార్కెట్ ఉందని చెప్పారు. ఏజెన్సీలో లభించే అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కరస్పాండెంట్ రూబీ, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

66 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ యామినిప్రియ

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి సబ్ సెంటర్‌లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు డాక్టర్ యామినిప్రియ వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించామన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎస్ఎం లీలావతి, 104 డీఈఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శామ్యూల్, ఆశ చంద్రకళ, ఫైలట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రేపు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 19న ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు కుటుంబసమేతంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలని కోరారు.

సర్పంచ్ కాంతం మృతి పార్టీకి తీరని లోటు

- రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



మృతురాలు కాంతం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని వంచంగి సర్పంచ్ కాంతం మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సర్పంచ్ కాంతం గుండెపోటుతో అస్వస్థతకు గురై ఇటీవల ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి శనివారం వంచంగి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సర్పంచ్ కాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, కుశరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



అరకు ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది



దుంబ్రిగుడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న పారా మెడికల్ సిబ్బంది



ముంచంగిపుట్టులో సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది



జి.మాడుగులలో వైద్యులు, సిబ్బంది నిరసన



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చింతూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైద్యులు



చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది



రాజవొమ్మంగిలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ



రంపచోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



మోతుగూడెంలో వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ

అరకులోయ రూరల్/ దుంబ్రిగుడ/ ముంచంగిపుట్టు/ జి.మాడుగుల/ చింతపల్లి/ రంపచోడవరం / మోతుగూడెం/ చింతూరు/ రాజవొమ్మంగి/వై.రామవరం: కోల్‌కతాలోని డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. ప్రాణం పోసే డాక్టర్లు ప్రాణం తీయకండి అంటూ శనివారం భారీగా ర్యాలీలు నిర్వహించారు. ఆస్పత్రిలో కొంత సేపు ఓపీ సేవలు నిలిపి వేసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు, ప్రముఖులు మాట్లాడుతూ ప్రభుత్వాల వైఫల్యంతోనే వైద్య ఆరోగ్య శాఖ మహిళ ఉద్యోగులపై హత్యాచారాలు, దాడులు తదితర ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతున్న వైద్యులపై పైశాచికంగా దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు, ప్రతి ప్రభుత్వ ఆస్పత్రులకు పోలీస్ రక్షణ కల్పించాలన్నారు. దేశంలోని వైద్య రంగంలో ఉన్న మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని డాక్టర్ సామూహిక అత్యాచారం, హత్య ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను అమలుచేయాలన్నారు. ప్రాణాలను బతికించే వైద్యులను బలి తీసుకోకండి.. వైద్యులపై దాడులు పూర్తిగా నశించాలని.. ప్రజారోగ్యం మా బాధ్యత మా రక్షణ అంటూ నినాదాలు చేశారు. అరకులోయలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాము, వైద్యులు హరి, శ్రీకాంత్, ప్రేమ, పావని, ధరణి, మనోజ్, డుంబ్రిగుడలో పీహెచ్ఎన్ రత్నం, హెచ్ఎస్ రామారావు, పారా మెడికల్ సిబ్బంది రవీంద్ర, లవరాజు, స్వామి, సంజీవ్, ప్రభాకర్, హరికృష్ణ, మిల్టాన్ ఎఎన్ఎంలు, ముంచంగిపుట్టులో వైద్యులు గీతాంజలి, సంతోష్, ధరణి, రంపచోడవరం, మోతుగూడెంలలో ఏపీ జెన్కో ఆస్పత్రి వైద్యురాలు ప్రవల్లిక, వై.రామవరంలో డాక్టర్ మౌమిత, రాజవొమ్మంగిలో వైద్యులు సుష్మా, సరోజ్ ముఖర్జీ, చింతూరులో ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. ఏపీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన వ్యాన్: రాకపోకలకు అంతరాయం



కె.కోడాపల్లి వద్ద బురదలో కూరుకుపోయిన వ్యాన్

జి.మాడుగుల: పాడేరు మార్గంలో కె కోడాపల్లి గ్రామ సమీపంలో శనివారం మొక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్ బురదలో కూరుకుపోయింది. దీంతో ఈ రోడ్డులో వాహనరాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జి.మాడుగుల-పాడేరు ఎన్‌హెచ్-516ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు కె.కోడాపల్లి దగ్గర కల్వర్టు నిర్మాణ నిమిత్తం తీసిన గోతిలో వ్యాన్ కురుకుపోయింది. పాడేరు- జి.మాడుగుల, చింతపల్లి తదితర ప్రాంతాలకు వాహనాలతో రాకపోకలు సాగించే ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం వ్యాన్‌ను బయటకు తీయడంతో యధావిధిగా రాకపోకలు సాగాయి.

కాఫీ రైతులకు ప్రోత్సాహక నిధులు అందజేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను

ముంచంగిపుట్టు: గిరిజన కాఫీ రైతులకు ఐటీడీఏ ద్వారా అందించాల్సిన ప్రోత్సాహక నిధులు వెంటనే అందించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, నర్సయ్య తదితరులు డిమాండ్ చేశారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ కాఫీ రైతులకు ఐటీడీఏ నుంచి రూ.2వేలు ప్రోత్సహక నిధులు అందించేవారని, ప్రస్తుతం అందడం లేదని, దీనిపై గతంలో పాడేరు ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తే అధికారులు,అప్పటి కలెక్టర్ ,పీవోలు మూడు దఫాలుగా సొమ్ము చెల్లిస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. ప్రభుత్వం స్పందించి కాఫీ రైతులకు అందించాల్సిన ప్రోత్సాహక నిధులు వెంటనే అందించాలన్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట కాఫీ రైతులతో ఆందోళన కార్యక్రమం చేస్తామని వారు హెచ్చరించారు.

తూతూ మంత్రంగా మండల పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో లోహిత్ జయసాగర్

జి.మాడుగుల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ కళ్యాణి అధ్యక్షతన శనివారం తూతూ మంత్రంగా జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ సమావేశంలో ఎటువంటి ప్రజా సమస్యలు, ఇబ్బందులు తదితర అంశాలు చర్చించకుండానే అంతంత మాత్రంగానే జరిగింది. కొంతమంది ప్రజాప్రతినిధులు విద్య, తాగునీరు, ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులుకు వస్తున్నట్టు వంటి అంశాలు లేవనత్తగా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, ఎల్.అప్పలరాజు, చిన్నారావు, ఈశ్వరరావు, అప్పారావు, రవని, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, హనుమంతరావు, సూరిబాబు, సీదరి కొండబాబు. చినకుమారి, చిలకమ్మ, రాజులమ్మ, ఏవో పాత్రుడు, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎస్ఎంఐ ఏఈ స్వాతి, సీడీపీవో సువర్ణమ్మ, జీసీసీ బీఎం కొండన్న, ఐకెపీ ఏపీఎం సుందరమ్మ, ఏపీవో కొండబాబు, ఈవోపీఆర్డీ డేవిడ్, హౌసింగ్ శాఖ అధికారి ఈశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

తహసీల్దార్ల నియామకం



రాజవొమ్మంగి తహసీల్దార్, సత్యనారాయణ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి తహసీల్దార్‌గా కరక సత్యనారాయణను నియమిస్తు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో దేవీపట్నం తహసీల్దార్‌గా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆయనను కృష్ణా జిల్లా గుడివాడకు బదిలీ చేశారు. అనంతరం కరక సత్యనారాయణను రాజవొమ్మంగి తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. కాగా ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డి.సత్యనారాయణ ఏలూరుకు బదిలీ అయ్యారు.

కూనవరం: కూనవరం నూతన తహసీల్దార్‌గా ఎ.తాతారావు శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.వి.మురళీకృష్ణ కూనవరం తహసీల్దార్‌గా బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో తాతారావును ఇక్కడి తహసీల్దార్‌గా నియమించారు.

చింతూరు: మండల తహసీల్దార్‌గా పి.వి.వి.జె.ఎస్.కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన నజీముల్లాషా ఎన్నికల అనంతరం ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో రంపచోడవరం తహసీల్దార్‌గా పనిచేసిన కుమార్ ఎన్నికల విధుల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల అనంతరం పోస్టింగుల్లో భాగంగా ఆయనను చింతూరు తహసీల్దార్‌గా నియమించారు. ఎటపాక తహసీల్దార్‌గా టీ.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎటపాక తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శేఖర్‌కు ఇటీవల బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది.

గంగవరం : గంగవరం రెగ్యులర్ తహసీల్దార్‌గా శ్రీనివాసును నియమిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

అనంతగిరి(అరకులోయ రూరల్): మండల కేంద్రంలోని అనంతగిరి-విశాఖ ప్రధాన రహదారి మధ్యలో ఎండిపోయి ఉన్న మామిడి చెట్టు ప్రమాదకరంగా మారింది, ఈ మార్గంలో రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయని పలువురు చెబుతున్నారు. ఇటీవల ఈదురుగాలులకు చెట్టు కొమ్మలు పడ్డాయని, త్రుటిలో ప్రమాదం తప్పిందని చెబుతున్నారు. ఎండిన చెట్టు వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. పలు శాఖల అధికారులు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండిపోయిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

అనంతగిరి-విశాఖ రహదారిలో ఎండిపోయిన చెట్టు →



క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జమాల్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్

కూనవరం: మండలంలోని పెదార్కూర్ గ్రామంలో శ్రీ మాంచనగిరి యూత్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు జేకే సీటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ బహుమతులు అందజేశారు. టోర్నీలో నాలుగు మండలాల నుంచి 60 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు పెదార్కూరు, చినార్కూరు టీమ్‌లు చేరాయి. శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పెదార్కూరు టీమ్ విజేతగా నిలిచింది. మొదటి బహుమతిగా రూ.30,000 నగదు, కప్ దక్కించుకుంది. రన్నరప్‌గా చినార్కూరు టీమ్‌కు రూ.20.000 నగదుతో పాటు కప్, సెకండ్ రన్నరప్ కుమ్మూరు టీమ్‌కు నగదు, కప్‌ను జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్, కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్ అందజేశారు. గ్రామస్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



పాడేరులో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోటిబాబునాయుడు, జర్నలిస్టులు

సాక్షి, పాడేరు/చింతపల్లి/గూడెంకొత్తవీధి/ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను ఏపీయుడబ్ల్యుజే ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం వర్కింగ్ జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు, చింతపల్లి, గూడెం కొత్తవీధి, ముంచంగిపుట్టు ఆస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చింతపల్లిలో మొక్కలు నాటారు. జీకేవీధిలో జరిగిన కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి మాట్లాడుతూ పాత్రికేయుల సేవలను కొనియాడారు. వెదురుపల్లిలో విద్యార్థులు పాతపుస్తకాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోటిబాబునాయుడు, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు దుర్గారావు, శ్రీనివాసరావు, జోష్, రాజేష్, కొండలరావు, సతీష్, రాజు, శ్రీను, సురేష్, మోహన్, విజయవెంకట్, శ్రీనివాసరావు, భూషణ్, భాస్కర్, ఈశ్వర్, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.